# కాకతీయ అనంతర యుగ పరిస్థితులు

కాకతీయుల అనంతరం ముసునూరు నాయకులు, రేచర్ల వెలమలు, రెడ్డిరాజులు పాలించారు. వీరంతా కాకతీయ యుగంనాటి సంస్కృతినే అనుసరించినప్పటికీ కొన్ని పాలన, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక పరమైన మార్పులను ప్రవేశపెట్టారు.

**పాలనా విధానాలు:** ఈ యుగాన్ని కాకతీయ యుగానికి అనుబంధ యుగంగా చెప్పవచ్చు. ఈ యుగ పాలకులు సంప్రదాయిక రాచరిక విధానాన్ని అనుసరించారు. రాజు సర్వాధికారి. రాజ్యాన్ని భూములు – సీమలు – నాడులు – స్థలాలు – గ్రామాలుగా విభజించారు. రాజుకు పరిపాలనలో ప్రధాని, సేనాపతి, పురోహితుడు మొదలైనవారు తోడ్పడేవారు. రాజు అనంతరం ప్రధానాధికారి యువరాజు. సీమలపై పారుపత్యదారు, స్థలాల్లో కరణాలు, గ్రామాల్లో ఆయగాండ్రు అనేవారు పాలనా వ్యవహారాలను చూసేవారు.

★ గ్రామపాలనలో 12 మంది ఆయగాండ్రు ఉండేవారు. వీరిలో రెడ్డి, కరణం, తలారి ప్రభుత్వోద్యోగులు. తలారినే ఆరెకుడు అని కూడా పిలిచేవారు. న్యాయ నిర్వహణలో దివ్య పరీక్షలు అమల్లో ఉండేవి. పంటలో 1/6 వ వంతు భూమి శిస్తుగా వసూలు చేసేవారని విలస తామ్రశాసనం పేర్కొంటోంది. దేవబ్రాహ్మణ మాన్యాలపై పన్ను మినహాయింపు ఉండేది. దశబంధమాన్యం పేరుతో 1/10 వ వంతు నీటి తీరువా పన్ను వసూలు చేసేవారు.

★ యుద్ధంలో చనిపోయినవారి రక్తమాంసాలతో అన్నం వండి, యుద్ధ దేవతలకు నైవేద్యం పెట్టే 'రణముకుడుపు' అనే ఆచారాన్ని పాటించేవారు. శత్రుసైన్యాలు నడిచే దారుల్లోని నీటి వనరుల్లో విషం కలిపేవారని సకలనీతి సమ్మతం అనే గ్రంథం వివరిస్తోంది.

### ఆర్థిక పరిస్థితులు

ఈ యుగంలో వ్యవసాయం ప్రధానవృత్తి. ప్రధాన ఆహారపంట జొన్న, వాణిజ్య పంట ద్రాక్ష. రెడ్డిరాజులు, వెలమలు అనేక చెరువులను తవ్వించి, నీటిపారుదల సౌకర్యాలను మెరుగుపరిచారు. రెడ్డిరాజులు సంతానసాగరం చెరువు, వెలమలు అనపోతు సముద్రం, రాయ సముద్రం, నాగ సముద్రం మొదలైన చెరువులను తవ్వించారు.

★ ఈ కాలంలో వస్త్ర పరిశ్రమ అగ్రస్థానంలో ఉండేది. పల్నాడు, వినుకొండ ప్రధాన వస్త్ర పరిశ్రమ కేంద్రాలు. కొరవి గోపరాజు రచించిన సింహాసన ద్వాత్రింశిక అనే గ్రంథం వివిధ రకాల పట్టు వస్త్రాలతో పాటు శ్రీలంకకు ఎగుమతి చేసే నేత వస్త్రాల గురించి పేర్కొంది. నిర్మల్ కత్తులు ఎంతో ప్రసిద్ధి చెందాయి.

★ ఆ కాలంలో విదేశీ వాణిజ్యాన్ని నిర్వహించినవారిలో అవచి తిప్పయ్యశెట్టి అత్యంత ప్రముఖుడు. శ్రీనాథుడి హరవిలాస గ్రంథం కప్పలి, జోంగు, వలి, వల్లికా లాంటి వివిధ రకాల నౌకలను గురించి పేర్కొంది. జోంగు అనేది చైనా దేశపు వాణిజ్య నౌక.

### మత పరిస్థితులు

రెడ్డిరాజులు మొదట శైవమతాన్ని అనుసరించినప్పటికీ కుమారగిరిరెడ్డి, కాటయ వేమారెడ్డి లాంటి రాజులు వైష్ణవమతాన్ని అవలంబించారు. రెడ్డిరాజుల కులదేవత మూలగూరమ్మ. స్మార్త విధానం అమల్లో ఉండేది. ఈ కాలంలో భక్తి ఉద్యమ ప్రభావం కనిపిస్తుంది. రణముకుడుపు అనే తాంత్రిక ఆచారాన్ని పాటించేవారు. దైవం పేరుతో ఆత్మార్పణ చేసేవారి ప్రతిమలున్న శిలలను (వీరకల్) నిలిపేవారు.

★ శ్రీశైలంలో కొండపై నుంచి దూకి, మరణించే భృగుపాతం అనే విధానాన్ని ఆచరించేవారని పండితారాధ్య చరిత్ర పేర్కొంటోంది. త్రిపురాంతకం కేంద్రంగా ఘోడెరాయవంశం శైవమతాన్ని ప్రచారం చేసేవారు. వామనభట్ట బాణుడు తన వేమభూపాలచరిత్ర గ్రంథంలో వింధ్యవాసినీ పూజను వివరించాడు. శ్రీరంగం కేంద్రంగా భట్టారు కుటుంబం వైష్ణవమతాన్ని ప్రచారం చేసింది.

★ కోరుకొండ పాలకుడైన ముమ్మిడి నాయకుడు తన గురువు శ్రీరంగ వర్ధనుడు (ఏడో పరాశరభట్టు) మరణానంతరం కోరుకొండ నరసింహాలయాన్ని నిర్మించాడు. పద్మనాయక రాజు సర్వజ్ఞసింగ ఆస్థానంలో నైనాచార్యుడు లేదా వరదాచార్యుడు అనే వ్యక్తి వైష్ణవాన్ని వ్యాప్తి చేశాడు. నైనాచార్యుడి తండ్రి వేదాంత దేశికుడు సుభాషితనీవి, తత్వ సందేశ, రహస్య సందేశ లాంటి గ్రంథాలను రచించాడు.

★ ఆళ్వారులు నల్లాయిర ప్రబంధం పేరుతో రచనలు చేసేవారు. రామానుజాచార్యుడు శ్రీవైష్ణవాన్ని రూపొందించి, దేవాలయాల్లో పంచముల ప్రవేశానికి అనుమతించాడు. తర్వాతి కాలంలో శ్రీవైష్ణవం తెంగల, వడగల శాఖలుగా విడిపోయింది. వడగల శాఖకు నాయకుడు వేదాంత దేశికుడు. ఈ శాఖకు చెందిన వ్యక్తులు అహోబిలంలో మఠాన్ని నెలకొల్పి, తమ సిద్ధాంతాలను ప్రచారం చేశారు. పద్మనాయకుల ఆస్థానంలో శాకల్యమల్లు భట్టుకు, పరాశర భట్టుకు మధ్య శైవ, వైష్ణవ సంవాదం జరిగింది.


R-22-4-17

**సామాజిక పరిస్థితులు**

చాతుర్వర్ణ వ్యవస్థ ఉండేది. సమాజంలో బ్రాహ్మణుల ఆధిక్యం కొనసాగింది. ఆ కాలంలో జూదం సర్వసాధారణ వినోదంగా మారింది. బ్రాహ్మణుల్లో కూడా వేశ్యాలంపటత్వం మితిమీరినట్లు శ్రీనాథుడి శివరాత్రి మహాత్మ్యం అనే గ్రంథం తెలియజేస్తోంది. వడ్డీ వ్యాపారులు ఎక్కువగా మోసాలకు పాల్పడేవారు. శకునాలపై అధిక నమ్మకం కలిగి ఉండేవారు. పంచాంగానికి ప్రాధాన్యం పెరిగింది. నైతిక విలువలు బాగా తగ్గిపోయాయి. తాంబూలం వేయడం గౌరవ సూచకంగా మారింది. వర విక్రయం, అరణం (అత్తగారు అల్లుడికి భూమి, డబ్బు ఇవ్వడం) లాంటి ఆచారాలుండేవి.

**భాషా, సాహిత్యాలు – అభివృద్ధి**

ఈ యుగంలో సంస్కృతం రాజభాషగా ఉండేది. లలితకళలను పెంచిపోషించారు. వసంతోత్సవాలను అధికంగా, ఘనంగా నిర్వహించేవారు. నటులకు, గాయకులకు ప్రోత్సాహం లభించేది. గొండ్లి, జిక్కిణి, పేరిణి, చిందు లాంటి దేశీయ నృత్యరీతులే కాకుండా మత్తల్లి అనే పారశీక విదేశీ నాట్యరీతి కూడా ప్రాచుర్యంలో ఉండేది. అనేక రకాల వీణల గురించి నాటి సాహిత్యంలో, శిల్పకళల్లో ప్రస్తావించారు.

★ ప్రోలయ వేమారెడ్డి ఆస్థానంలోని విద్యాధికారి అయిన మహాదేవుడు గొప్ప సంస్కృత విద్వాంసుడు. అనవోతారెడ్డి కాలంలోని బాల సరస్వతి, అనవేమారెడ్డి కాలంనాటి త్రిలోచనాచార్యులు గొప్ప పండితులు. కుమారగిరిరెడ్డి వసంతరాజీయం అనే గ్రంథాన్ని, కాటయ వేమారెడ్డి కుమారగిరిరాజీయం అనే వ్యాఖ్యానాన్ని రచించారు. పెదకోమటి వేమారెడ్డి సంగీత చింతామణి, సాహిత్య చింతామణి లాంటి గ్రంథాలను రాశాడు. ఇతడి ఆస్థానకవి అయిన వామనభట్టబాణుడు ఉషాపరిణయం, పార్వతీపరిణయం, నలాభ్యుదయం, రఘునాథాభ్యుదయం, హంస సందేశం, వేమ భూపాల చరిత్ర, శబ్ద రత్నాకరం, శబ్ద చంద్రిక అనే గ్రంథాలను రచించాడు. కందుకూరు పాలకుడైన శివలింగారెడ్డి తత్వ ప్రకాశిక అనే వ్యాఖ్యానాన్ని రాశాడు. రాజమండ్రి రెడ్డిరాజు వీరభద్రారెడ్డి సాహిత్య, సంగీత, లక్ష్యలక్షణ భంగీసర్వజ్ఞుడిగా కీర్తి పొందాడు.

★ రేచర్ల పద్మనాయకరాజు అనవోతానాయుడి ఆస్థానంలో ఉన్న నాగనాథకవి మదనవిలాస బాణం అనే గ్రంథాన్ని రచించాడు. రెండో సింగభూపాలుడు రసార్ణవ సుధాకరం, సంగీత సుధాకరం, రత్నపాంచాలిక లాంటి గ్రంథాలను రాశాడు. సారంగధరుడు రచించిన సంగీత రత్నాకర గ్రంథంపై చేసిన వ్యాఖ్యానమే సంగీత సుధాకరం. రెండో సింగముడి ఆస్థానంలో ఉన్న విశ్వేశ్వరుడు చమత్కార చంద్రిక అనే అలంకార శాస్త్ర గ్రంథాన్ని రచించాడు. బొమ్మకంటి అప్పయార్యుడు అనే కవి అమరకోశానికి వ్యాఖ్యానాన్ని రాశాడు.

★ మొదటి సింగమ నాయకుడి ఆస్థానంలో ఉన్న శాకల్యమల్లు భట్టు నిరోష్ఠ్య రామాయణం, ఉదారరాఘవం అనే గ్రంథాలనూ, అవ్యయ సంగ్రహం అనే నిఘంటువునూ రచించాడు. ఈ యుగంలో తెలుగు భాషలో ఎన్నో గ్రంథాలు వెలువడ్డాయి. 'దేశ భాషలందు తెలుగు లెస్స' అని పలికిన తొలి వ్యక్తి వినుకొండ వల్లభరాయుడు. క్రీడాభిరామం గ్రంథంలో అతడు ఈ వాక్యాన్ని ఉపయోగించాడు.

★ దగ్గుపల్లి దుగ్గన కాంచీపుర మహాత్మ్యం గ్రంథాన్ని రాశాడు. ఎర్రన ఉత్తర హరివంశం అనే గ్రంథాన్ని రచించి, ప్రోలయ వేమారెడ్డికి అంకితం ఇచ్చాడు. ఇతడు తన చివరి రచన నృసింహ పురాణంలో ప్రబంధశైలికి బీజం వేశాడు. ఈయనకు ప్రబంధ పరమేశ్వరుడు, శంభు దాసుడు అనే బిరుదులున్నాయి. శ్రీగిరి కవి నవనాథ చరిత్ర, విన్నకోట పెద్దన కావ్యాలంకార చూడామణి గ్రంథాలను రచించారు.

★ కావ్యాలంకార చూడామణి గ్రంథం చాళుక్య విశ్వేశ్వరుడికి అంకితం ఇచ్చారు. మడికి సింగన తన పద్మపురాణాన్ని కందయామాత్యుడికి అంకితం చేశాడు. సకలనీతి సమ్మతం, వాశిష్ఠ రామాయణ గ్రంథాలను కూడా మడికి సింగన రచించాడు. కుమారగిరిరెడ్డికి సమకాలీనుడైన వినుకొండ వల్లభరాయుడు కడప జిల్లాలోని మోపూరి గ్రామాధికారి. ఇతడు రావిపాటి త్రిపురాంతకుడు సంస్కృతంలో రచించిన ప్రేమాభిరామాన్ని తెలుగులో క్రీడాభిరామంగా రాశాడు. తెలుగు సాహిత్యంలో తొలి వీధి నాటకంగా క్రీడాభిరామం పేరుపొందింది.

★ అనంతామాత్యుడనే కవి భోజరాజీయం అనే గ్రంథాన్ని రాశాడు. దేవరకొండ పద్మనాయకరాజు పెదవేదగిరి ఆస్థానంలో ఉన్న అయ్యలార్యుడు రామాయణ ఆంధ్రీకరణను పూర్తిచేశాడు. సరస సాహిత్య లక్షణ చక్రవర్తి బిరుదుపొందిన గౌరన హరిశ్చంద్రోపాఖ్యానం, నవనాథ చరిత్ర, లక్షణ దీపిక లాంటి రచనలు చేశాడు. గోన బుద్ధారెడ్డి రంగనాథ రామాయణాన్ని రచించాడు. మూడో సింగముని కాలంలో నివసించిన పోతన భోగినీ దండకం, ఆంధ్ర మహాభాగవతం, వీరభద్ర విజయం లాంటి గ్రంథాలను రాశాడు.

★ ఉదయగిరి బసవభూపాలుడి ఆస్థానంలో నివసించిన దూబగుంట నారాయణకవి తెలుగులో పంచతంత్రాన్ని రచించాడు. మరో కవి దగ్గుపల్లి దుగ్గన నాచికేతోపాఖ్యానం, కాంచీపుర మహాత్మ్యం అనే గ్రంథాలను రాశాడు. శ్రీనాథుడు తెలుగు సాహిత్యానికి గొప్ప గ్రంథాలను అందించాడు. శృంగార నైషధం, కాశీఖండం, భీమఖండం, పల్నాటి వీరచరిత్ర, శివరాత్రి మహాత్మ్యం, హరవిలాసం, మరుత్తరాట్ చరిత్ర, పండితారాధ్య చరిత్ర గ్రంథాలు వీటిలో ప్రముఖమైనవి. శృంగార నైషధాన్ని మామిడి సింగనకు, హరవిలాసాన్ని అవచి తిప్పయ్యశెట్టికి, పండితారాధ్య చరిత్రను మామిడి ప్రెగ్గడకు, కాశీఖండాన్ని వీరభద్రారెడ్డికి, భీమఖండాన్ని బెండపూడి అన్నయకు అంకితం ఇచ్చాడు.

★ సంతానసాగరం చెరువు శాసనాన్ని శ్రీనాథుడే రాశాడు. ఈయన విజయనగర రాజైన రెండో దేవరాయల ఆస్థానాన్ని సందర్శించాడు. అతడి ఆస్థానకవి గౌడ డిండిమభట్టును ఓడించి, రాయల నుంచి కవిసార్వభౌమ అనే బిరుదును పొందడమే కాకుండా గండపెండేరాన్ని కూడా తొడిగించుకున్నాడు.

### మాదిరి ప్రశ్నలు

**1.** ఏ ప్రాంతానికి సంబంధించిన అధికారిని పారుపత్యదారుగా పేర్కొనేవారు?

1) భూమి 2) సీమ 3) నాడు 4) గ్రామం

**2.** ఆయగాండ్రులోని ఏ వ్యక్తిని ఆరెకుడుగా పిలిచేవారు?

1) రెడ్డి 2) కరణం 3) తలారి 4) మంగలి

**3.** విలస తామ్రశాసనం ప్రకారం భూమిశిస్తు ఎంత ఉండేది?

1) 1/3వ వంతు 2) 1/6వ వంతు
3) 1/2వ వంతు 4) 1/10వ వంతు

**4.** శ్రీలంకకు ఎగుమతిచేసే నేత వస్త్రాలు, పలురకాల వస్త్రాల గురించి తెలియజేసే రచన ఏది?

1) హరవిలాసం 2) సింహాసన ద్వాత్రింశిక
3) కాశీఖండం 4) నాచికేతోపాఖ్యానం

**5.** కాకతీయ అనంతర యుగంలోని చైనా దేశపు గొప్ప వాణిజ్య నౌక ఏది?

1) కప్పలి 2) వలి 3) వల్లికా 4) జోంగు

**6.** కింద పేర్కొన్నవాటిలో రెడ్డిరాజుల కులదేవత ఎవరు?

1) చండి 2) గౌరీదేవి 3) దుర్గాదేవి 4) మూలగూరమ్మ

**7.** కింది అంశాలను జతపరచండి.

| | |
|---|---|
| i. త్రిపురాంతకం | a) భృగుపాతం |
| ii. శ్రీరంగం | b) శైవమతం |
| iii. అహోబిలం | c) శ్రీవైష్ణవం |
| iv. శ్రీశైలం | d) వడగలశాఖ |

1) i-a, ii-b, iii-c, iv-d 2) i-b, ii-a, iii-d, iv-c
3) i-b, ii-c, iii-d, iv-a 4) i-a, ii-c, iii-d, iv-b

**8.** అహోబిలం కేంద్రంగా వడగలశాఖను ప్రచారం చేసింది ఎవరు?

1) ఘోడెరాయ వంశం 2) భట్టారు కుటుంబం
3) వేదాంత దేశికుడు 4) రామానుజాచార్యుడు

**9.** తెలుగులో పంచతంత్రాన్ని రచించింది ఎవరు?

1) విష్ణుశర్మ
2) దూబగుంట నారాయణకవి
3) శివలెంకకొమ్మన
4) ఎర్రాప్రగడ

**10.** రెడ్డియుగం నాటి వాణిజ్య నౌకల గురించి పేర్కొన్న శ్రీనాథుడి రచన ఏది?

1) ఆరాధ్యచరిత్ర
2) శివరాత్రి మహాత్మ్యం
3) హరవిలాసం
4) భీమేశ్వర పురాణం

**11.** కాకతీయ అనంతర యుగంలో ప్రాచుర్యంలో ఉన్న మత్తల్లి అనేది ఏ నాట్య రీతి?

1) దేశీయ
2) పారశీక
3) చైనా
4) ఈజిప్షియన్

**12.** కింది అంశాలను జతపరచండి.

i. హంస సందేశం — a) కాటయ వేమారెడ్డి
ii. కుమారగిరి రాజీయం — b) కుమారగిరి రెడ్డి
iii. వసంత రాజీయం — c) వామనభట్ట బాణుడు
iv. తత్త్వప్రకాశిక — d) శివలింగారెడ్డి

1) i-a, ii-d, iii-c, iv-b
2) i-c, ii-a, iii-b, iv-d
3) i-a, ii-c, iii-d, iv-b
4) i-d, ii-a, iii-b, iv-c

**13.** కిందివాటిలో రెండో సింగముని రచన కానిది ఏది?

1) సంగీత సుధాకరం
2) సంగీత రత్నాకరం
3) రసార్ణవ సుధాకరం
4) రత్న పాంచాలిక

**జవాబులు**

1-2; 2-3; 3-2; 4-2; 5-4; 6-4; 7-3; 8-3; 9-2; 10-3; 11-2; 12-2; 13-2.

**రచయిత: బి. నాగరాజు**

www.eenadupratibha.net